క్లుప్తంగా

నమో శివరుద్రాయ

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో స్వామికి సోమవారం విశేషంగా అభిషేకాలు, పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. బిల్వపత్రాలతో స్వామిని అభిషేకిరించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

ఘనంగా షిర్డీసాయి విగ్రహ ప్రతిష్ట



సాయిబాబాకు పూజలు చేస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు పురుషోత్తపురంలోని గౌరీ విశ్వేశ్వరస్వామి ఆలయ సముదాయంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ట సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. బాబాకు విశేష పూజలు జరిపారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో దాదాపు 2 వేల మంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. కార్పొరేటర్ ముమ్మన దేముడు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితుడు చందుయాదవ్, నాయకులు, కాలనీ పెద్దలు పూజల్లో పాల్గొన్నారు.

నేడు భీష్మ ఏకాదశి కల్యాణోత్సవాలు

సింహాచలం: భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం శ్రీవరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన ఉపాలయాల్లో కల్యాణోత్సవాలను విశేషంగా నిర్వహిస్తున్నట్టు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతకస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి 9.30 గంటల నుంచి గ్రామ తిరువీధి, కల్యాణోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే కొండ దిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సాయంత్రం 4 నుంచి గ్రామ తిరువీధి, రాత్రి 7గంటల నుంచి కల్యాణోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే మాధవధారలోని వేణుగోపాలస్వామి ఆలయంలో రాత్రి 7.30గంటల నుంచి కల్యాణోత్సవం, 9గంటలకు తిరు వీధి నిర్వహిస్తామని తెలిపారు. భక్తులంతా కల్యాణోత్సవాల్లో పాల్గొని ఆశీస్సులు పొందాలని కోరారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

అప్పన్నను దర్శించుకున్న మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న జస్టిస్ వెంకటరమణ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం మధ్య ప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తరం పూజ నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని, జ్ఞాపిక, శేషవస్త్రాన్ని ఏఈవో పాలూరి నరసింగరావు అందజేశారు.

టీబీ నివారణకు చర్యలు

మహారాణిపేట: వచ్చే ఏడాది నాటికి దేశంలో టీబీని పూర్తిగా నివారించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి చాంబర్‌లో సోమవారం టీబీపై సమావేశం నిర్వహించారు. జగదీశ్వరరావు మాట్లాడుతూ టీబీ నివారణకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికను రూపొందించాయన్నారు. దీనిని అన్ని శాఖల అధికారులు అమలు చేయాలన్నారు. చింతల అగ్రహారం, గొరపల్లి, సరిపల్లి, ఎస్‌ఆర్ పురం తదితర గ్రామాల్లో టీబీ నివారణపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా టీబీ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్ర బాబు, జిల్లా పంచాయతీ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, వైద్యులు రామారావు, రమేష్ పాల్గొన్నారు.

సంక్షేమ సారథులు వలంటీర్లు

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



పరవాడలో ఉత్తమ వలంటీర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతీ ఒక్కరికీ అందించడానికి వలంటీర్లు సైనికుల్లా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. స్థానిక మరిడిమాంబ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన ఉత్తమ వలంటీర్లకు సేవా పురస్కారాల ప్రదానోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. మండలంలో 286 మంది వలంటీర్లు సేవా పురస్కారాలకు ఎంపికయ్యారని చెప్పారు. సేవా వజ్ర పురస్కారానికి ఒకరు, సేవా రత్న, 5 గురు, సేవా మిత్రలకు 279 మంది అర్హత సాధించారన్నారు. అంకిత భావంతో పనిచేస్తున్న వలంటీర్లను ప్రభుత్వం నాలుగో ఏడాది అవార్డులతో సత్కరిస్తుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. వలంటీర్లకు ఎటువంటి కష్టమొచ్చినా తాను అండదండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. జగనన్న ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ప్రతిపక్షాలు, పచ్చమీడియాఓర్వలేక బురద జల్లుతున్నాయన్నారు. ఎన్ని పార్టీలకు ఏకమైనా 2024లో వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని.. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం ఖాయమన్నారు. ఉత్తమ వలంటీర్లకు శాలువా కప్పి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మీశ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, ఎంపీడీవో జి.వి.రాంబాబు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కండి

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ సూచించారు. దలాయిపాలెంలో ఎమ్మెల్యే గెస్ట్‌హౌస్‌లో సోమవారం పార్టీ ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పార్టీ శ్రేణులకు దిశదిశా నిర్దేశం చేశారు. పార్టీ విజయానికి కష్టించి పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి పక్షాలకు దీటుగా వ్యవహరించి పార్టీ విజయానికి పాటు పడాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ సూచించారు.

నిబద్ధతతో సేవలు

సబ్బవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా వలంటీర్లు నిబద్ధతతో పనిచేస్తున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పురస్కారాలు పొందిన వలంటీర్లను ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏటా వలంటీర్లకు వందనం పేరుతో సత్కరించడం ద్వారా వారికి ఆయన ఇచ్చే ప్రాధాన్యం,గౌరవం తెలుస్తుందన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ప్రభుత్వ పథకాలను సొంతి పార్టీ వారికే అందించడంతో పాటు అక్రమ వసూళ్లకు పాల్పడేవారన్నారు. దీంతో చలించిపోయిన సీఎం జగన్ అధికారం చేపట్టిన తర్వాత ప్రభుత్వ పథకాలు,సేవలను పారదర్శకంగా అర్హులైన లబ్ధిదారులకు అందించేందుకే ఈ వ్యవస్థ తీసుకొచ్చారన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు వలంటీర్లను జైల్లో పెడతామంటే , వలంటీర్లు ప్రజల డేటా సేకరించి విదేశాలకు అమ్మేస్తూ అమ్మాయిల అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని పవన్ కల్యాణ్ విమర్శిస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానారాయణ వలంటీర్లను గజదొంగలతో పోల్చడంపై అదీప్‌రాజ్ మండిపడ్డారు. వలంటీర్లంతా మరింత నిబద్ధతతో పని చేసి సీఎం ఇచ్చిన గౌరవాన్ని ఇనుమడింపజేసిన ప్రజల మన్ననలు పొందాలన్నారు.

362 మంది వలంటీర్లకు సత్కారం

మండలంలోని 362 మంది వలంటీర్లకు సేవా మిత్ర,సేవారత్న,సేవావజ్ర ద్వారా రూ.55 లక్షలు అందించనున్నట్లు తెలిపారు. సేవావజ్రకు ఎంపికైన బోదువలసకు చెందిన కొట్యాడ వెంకటలక్ష్మితో పాటు గొటివాడకు చెందిన శీరం ఆదిలక్ష్మికి రూ.45 వేల చొప్పున నగదుతో పాటు ప్రశంసా పత్రాలు అందజేసి సత్కరించారు. సేవారత్నకు ఎంపికైన అమృతపురానికి చెందిన కర్రి గణేష్,అంతకాపల్లికి చెందిన గండి అనిత,సబ్బవరం–2కు చెందిన కొటాన దేవి,సబ్బవరం–4కు చెందిన సమ్మంగి భవాని,తవ్వవానిపాలేనికి చెందిన బోకం ధనలక్ష్మికి రూ.30 వేల చొప్పున , మిగిలిన 355 మంది వలంటీర్లకు రూ.15 వేల చొప్పున అందజేశారు.

కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు,మాజీ జెడ్పీటీసీ కొటాన రాము, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు,ఎంపీడీవో రామ్మోహనరావు,ఈవోఆర్‌డీ మహేష్, సీనియర్ నాయకులు బోకం రాము నాయుడు,సబ్బవరపు ముత్యాలనాయుడు,రాపేటి రాము,ఐడీ బాబు,వడ్డాది అప్పలరాజు,బోను గంగునాయుడు,ఉగ్గిన నాయుడు పాల్గొన్నారు.



వలంటీర్లను సేవా పతకాలు, ప్రశంసా పత్రాలతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లు

సంతోషంగా ఉంది



గొటివాడ సచివాలయం పరిధిలో గ్రామ వలంటీర్‌గా 4 సంవత్సరాలుగా సేవలందిస్తున్నాను. బొండవానిపాలెం,సాలాపువానిపాలెం గ్రామాల్లో 62 కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు,సేవలను పారదర్శకంగా వారి ముంగిటకే అందిస్తున్నాను. నా సేవలను గుర్తించి సేవావజ్ర పురస్కారం కింద రూ.45 వేలు అందించారు. పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

–శీరం ఆదిలక్ష్మి, గొటివాడ ,సబ్బవరం

అరుదైన గౌరవం



రాలమయ్యపాలెం గ్రామ వలంటీర్‌గా ఐదేళ్లుగా పనిచేస్తున్నాను. మూడు సార్లు సేవా మిత్ర పురస్కారాలు అందుకున్నారు. ఈ సారి సేవా రత్న పురస్కారం అందుకోవడం అరుదైన గౌరవంగా భావిస్తున్నాను.మా సచివాలయం పరిధిలో 26 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు.నాకు సేవారత్న పురస్కారం అందించడంతో పాటు ఎమ్మెల్యే చేతుల మీదుగా సత్కరించడం చాలా సంతృప్తిగా ఉంది. మరింత బాధ్యతగా, పారదర్శకంగా సేవలు అందిస్తాను.

– గండి అనిత, రావలమ్మపాలెం,సబ్బవరం

గొప్ప అవకాశం లభించింది



సబ్బవరం–4 సచివాలయం పరిధిలోని గొర్లివానిపాలెం వలంటీర్‌గా పని చేస్తున్నాను. గ్రామ శివారు గంగిరెడ్లకాలనీలోని సుమారు 60 గృహాలకు ప్రభుత్వం అందిస్తున్న అన్నిరకాల పథకాలు, సేవలను లబ్ధిదారుల ముంగిటకే అందిస్తున్నాను. మూడు సార్లు సేవామిత్ర పురస్కారం అందుకున్నారు. ఈ సారి సేవారత్న వరించడం సంతోషంగా ఉంది. వలంటీర్‌గా పని చేసే అవకాశం లభించడం గొప్పగా ఉంది.

–సమ్మంగి భవాని, గొర్లివానిపాలెం ,సబ్బవరం

పేదల ఇంటికే పరిపాలన



బీఆర్‌టీఎస్ బాధితులకు బాండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి



పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి

- భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- అడవివరంలో 80 మంది వలంటీర్లకు సేవా మిత్ర అవార్డులు
- 102 మంది బీఆర్‌టీఎస్ బాధితులకు ఇళ్ల పట్టాల పంపిణీ

సింహాచలం: పేదవాడి ఇంటికే పరిపాలన తీసుకెళ్లిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శ పాలన చేస్తున్నారని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. భీమిలి నియోజకర్గం పరిధి 98వ వార్డు అడవివరంలో సోమవారం సాయంత్రం వలంటీర్లకు పురస్కారాలు , అడవివరంలోని బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణలో పూర్తిగా నిరాశ్రయులైన వారికి 48 గజాల ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ముత్తంశెట్టి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా చేసుకుని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేశారన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ల కోసం రోజుల తరబడి వృద్ధులు వేచి ఉన్న పరిస్థితి చూశామన్నారు. నేడు ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి పింఛన్ అందిస్తున్నారన్నారు. అలాంటి వలంటీర్ల సేవలను సీఎం వైఎస్ జగన్ గుర్తించి ఏటా పురస్కారాలు అందజేయడం గొప్పవిషయమన్నారు. ఈ సందర్భంగా 80 మంది వలంటీర్లను సత్కరించారు.

బీఆర్‌టీఎస్ బాధితులకు అండగా నిలిచాం

తొలిపావంచా నుంచి పాత అడవివరం వరకు బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ విషయంలో ప్రతి పక్షాలు రాజకీయాలు చేయడానికి ప్రయత్నం చేశారన్నారు. బాధితులకు అన్ని విధాలా న్యాయం చేసేందుకు కృషి చేశానన్నారు.ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి బీఆర్‌టీఎస్ బాధితుల టీడీఆర్‌ల విషయం కూడా తీసుకెళ్లడం జరిగిందన్నారు. వారందరికీ న్యాయం జరుగుతుందన్నారు. టీడీఆర్‌ల విలువ వైఎస్సార్‌సీపీ నాయకుల కంటే టీడీపీ వాళ్లకే ఎక్కువ వచ్చిందన్నారు. 102 మంది బీఆర్‌టీఎస్ బాధితులకు ఇళ్ల పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో 98వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, 98వవార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎర్ర వరాహ నరసింహం, వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రిస్వామి, కర్రిసత్తిబాబు, తొమురోతు రాము, ఎన్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న మహిళలు



ప్రసన్న వేంకటేశ్వరుని ఉత్సవ విగ్రహాలతో గిరి ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, భక్తులు

అక్కిరెడ్డిపాలెం: శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరుడి గిరి ప్రదక్షిణను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల శ్రీ వేంకటేశ్వర మరియు వినాయక స్వామి వార్ల ఆలయ వార్షికోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి గిరి ప్రదక్షిణ చేశారు. మహిళలు కలశాలతో పాల్గొన్నారు. దారి పొడవునా కోలాటాలతో సందడిగా ప్రదక్షిణ సాగింది. మంగళవారం భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ప్రసన్న వేంకటేశ్వరునికి పంచామృతాభిషేకం, ప్రసన్న గిరిపై కొలువైయున్న దాసాంజనేయ స్వామికి క్షీరాభిషేకం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఆలయ కార్యనిర్వాహక అధికారి ఎ.జగన్నాథరావు ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్ గంట్రెడ్డి రామునాయుడు, అచ్చిలి నాయుడు, పెట్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

‘కెమ్ ఈఈఈ–2024’ సదస్సు ప్రారంభం



సదస్సు షెడ్యూల్ విడుదల చేస్తున్న ప్రముఖులు

డాబాగార్డెన్స్: డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ) సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 21వరకు విశాఖలోని ఓ హోటల్‌లో సోమవారం కెమికల్, ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ (కెమ్ ఈఈఈ–2024) ట్రెండ్స్‌పై అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. శక్తి పరివర్తన ప్రాముఖ్యత, ఉద్యోగ కల్పనలో స్టార్టప్‌ల పాత్రను ఐఐటీ ఢిల్లీ ప్రొఫెసర్ సుద్ధసత్వబసు వివరించారు. ఎన్‌టీపీసీతో హైడ్రోజన్ ఉత్పత్తిపై పారిశ్రామిక ప్రాజెక్టులు, ఐఐపీఈ వృద్ధి, రూ.50 కోట్లకు పైగా పరిశోధన నిధులు పొందామని ఐఐపీఈ డైరక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్ తెలిపారు. బాలికలకు ఫెలోషిప్‌లు, శాండ్‌విచ్ పీహెచ్‌డీల గూర్చి వివరించారు. కెమ్ ఈఈఈ–2024 కన్వీనర్ ప్రొఫెసర్ హేమంత్‌కుమార తన్నేరు కాన్ఫరెన్స్ థీమ్‌ను పరిచయం చేస్తూ ఈవెంట్ స్పాన్సర్స్ విద్యాన్ బయో, సెర్బ్–ఇండియా, ఇండియన్ బ్యాంక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. సదస్సు షెడ్యూల్‌ను సదస్సు అధ్యక్షుడు ప్రొఫెసర్ శేషగిరిరావు అంబటి వివరించారు. ఐఐపీఈ, కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో కొనసాగుతున్న కార్యకలాపాలను కెమ్ ఈఈఈ–2024 ప్రతినిధి ప్రొఫెసర్ వెంకటరెడ్డి పల్లేటి వివరించారు. కార్యక్రమంలో ఐఐపీఈ రిజిస్ట్రార్ రాంఫెల్ ద్వివేది, ప్రొఫెసర్ దీపాంకర్ పాల్, నిర్వాహకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాఠశాల కిటికీ గ్రిల్ పడి విద్యార్థికి గాయాలు





ఎంఈవో పద్మావతితో మాట్లాడుతున్న విద్యార్థి సంఘం ప్రతినిధులు (ఇన్‌సెట్) గ్రిల్ ఊడిపోయిన కిటికీ

ఆనందపురం : మండలంలోని వెల్లంకిలో ఉన్న రవీంద్రభారతి పాఠశాల కిటికీ గ్రిల్ జారిపడి ఆదివారం ఓ విద్యార్థికి గాయాలయ్యాయి. పాఠశాల యాజమాన్యం ఈ విషయాన్ని గోప్యంగా ఉంచగా మంగళవారం వెలుగుచూసింది. స్థానికులు, పాఠశాల విద్యార్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా పాలకొండకు చెందిన వివేక్ ఇక్కడ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. అతడిని చూడడానికి వివేక్ అక్క నందిని కుటుంబ సభ్యులతో కలిసి పాఠశాలకు వచ్చింది. ఆమె పాఠశాల నుంచి తిరిగి వెళ్తుండగా పాఠశాల నాలుగో ఫ్లోర్‌లో ఉన్న కిటికీ గ్రిల్ ఊడి నందిని తలపై పడింది. దీంతో ఆమె తలకు బలమైన గాయం కావడంతో సంగివలసలోని ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. కాగా ఈ విషయం తెలుసుకున్న నందిని తండ్రి భాస్కరరావు, మరికొంత మంది పాఠశాలకు చేరుకొని సంఘటనపై పాఠశాల యాజమాన్యాన్ని నిలదీశారు. స్థానిక పోలీసులకు ఆస్పత్రి వర్గాల వారు విచారణ నిమిత్తం సమాచారం అందించారు.

ఎంఈవో విచారణ

ఆనందపురం ఎంఈవో ఎస్ఎస్ పద్మావతి మంగళవారం పాఠశాలను సందర్శించి విచారణ జరిపారు. గ్రిల్ ఊడిపడిన కిటికీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగో ఫ్లోర్‌లో నిర్వహిస్తున్న హాస్టల్ గదులు కిటికీల గ్రిల్స్ అన్నీ బలహీనంగా ఉన్నాయని వెల్లడించారు. కిటికీలకు ఉన్న అన్ని గ్రిల్స్‌ను సరిచేసేంత వరకూ ఆ ఫ్లోర్‌లో హాస్టల్ నిర్వహించరాదని ఆదేశాలిచ్చారు. సంఘటనపై శాఖాపరమైన విచారణ జరిపి విద్యార్థులకు ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలి

అకారణంగా గాయాలు పాలైన విద్యార్థి కుటుంబాన్ని పాఠశాల యాజమాన్యం ఆదుకోవాలని ఏబీవీపీ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. అలాగే పాఠశాల నిర్వహిస్తున్న గదులు అస్తవ్యస్తంగా ఉన్నాయని భవిష్యత్తులో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సంఘటన విషయమై స్థానిక పోలీసులను వివరణ కోరగా ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం ఉందని నందిని కుటుంబ సభ్యులు మాత్రం కేసు అక్కరలేదని తెలిపి నందిని సొంత గ్రామానికి తీసుకొని వెళ్లిపోయినట్టు తెలిపారు.

నెహ్రూ అవార్డు ప్రదానం



భాస్కరరావుకు అవార్డు అందజేస్తున్న సీఎండీ భట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఇంజినీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ విభాగంలోని ఫౌండ్రీ సెక్షన్ సీనియర్ ఫోర్‌మన్ సీహెచ్.భాస్కరరావుకు జవహర్‌లాల్ నెహ్రూ అవార్డు ప్రదానం చేశారు. స్టీల్‌ప్లాంట్ అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేసే ఉద్యోగులకు ఏటా జేఎన్ అవార్డులను అందజేస్తున్నారు. స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సీఎండీ అతుల్ భట్ చేతుల మీదుగా భాస్కరరావు అవార్డు అందుకున్నారు. డైరెక్టర్లు డి.కె.మొహంతి, బాగ్చీ, ఎస్.సి.పాండే తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ శిబిరం

పరవాడ: మండలంలోని పరవాడ, వాడచీపురుపల్లి, పెదముషిడివాడ గ్రామ సచివాలయాల్లో ఈ నెల 20 నుంచి ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయించుకోవడానికి శిబిరాన్ని అధికారులు చేపడుతున్నారు. ఈ నెల 20, 21, 22, 23 తేదీల్లో ఆధార్ అప్‌డేట్ చేసుకోవడానికి వీలుగా గ్రామ సచివాలయాల్లో శిబిరాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

ఘనంగా శ్రీలలితాపీఠం వార్షికోత్సవాలు



‘మన మహర్షులు’ పుస్తకం ఆవిష్కరిస్తున్న పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట : శ్రీలలితాపీఠం 75వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. అక్కయ్యపాలెంలోని లలితాపీఠంలో ‘అమృతోత్సవం’ పేరిట ఐదు రోజులపాటు నిర్వహిస్తున్న వేడుకలు కుర్తాళం పీఠాధిపతి, జగద్గురు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో మహా సంకల్పంతో ప్రారంభమయ్యాయి. కుర్తాళం పురోహితులు మాచవోలు రమేష్ శర్మ నేతృత్వంలో ముందుగా గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధన, అంకురార్పణ, అగ్ని మథనం, అఖండ దీపస్థాపన, పంచగవ్య సంస్కారం నిర్వహించారు. సాయంత్రం దర్బారుహాలులో లలితా వైభవంపై కవి సమ్మేళనం నిర్వహించారు. తిరుమల పెద్దింటి నరసింహాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కవి సమ్మేళనంలో 20 మంది కవులు పాల్గొని లలితా అమ్మవారి విశిష్టత, వైభవంపై అద్భుతమైన కవిత్వం చెప్పి అలరించా రు. ముందుగా ప్రముఖ రచయిత డి.వి.సూర్యారావు రచించిన ‘మన మహర్షులు’ పుస్తకాన్ని పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి, ఆచార్య బాలమోహన్‌దాస్ ఆవిష్కరించారు. రాంభట్ల నృసింహశర్మ పుస్తక సమీక్ష చేస్తూ 53 మంది మహర్షుల గురించి రచయిత డి.వి.సూర్యారావు పుస్తకంలో అద్భుతమైన వివరణతో పొందుపర్చారన్నారు. అనంతరం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతి స్వామిని పాల్గొన్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకుందాం



దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశంలో స్వాతంత్య్రం తర్వాత ప్రభుత్వరంగ సంస్థల వల్లే ఆర్థికాభివృద్ధి మెరుగుపడిందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. అటువంటి సంస్థలను కాపాడుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1103వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరంలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఉక్కు ఉద్యమాన్ని ప్రజా పోరాటంగా మలచి పాలకులు స్పందించే విధంగా కార్మికులు పోరాడాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి నిందితుడు

తాటిచెట్లపాలెం : గంజాయిని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని విశాఖ రైల్వేస్టేషన్‌లో గవర్నమెంట్ రైల్వే పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలు ప్రకారం.. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీసు(డీఎస్ఆర్పీ), బి.మోహనరావు ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ ఎస్ఐ ఎం.మధుసూదనరావు సిబ్బందితో కలసి విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. సుభాన్(25) అనే వ్యక్తి బ్యాగులో సుమారు 3 కేజీల గంజాయిని గుర్తించారు. ఈ గంజాయిని విశాఖ మీదుగా కేరళకు తీసుకువెళ్తున్నట్లు విచారణలో తెలిపాడని, నిందితుడి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. రిమాండు నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వేస్టేషన్ ప్లాట్ ఫాం–1లో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మరణించినట్లు గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆదేశాలతో ఎస్ఐ జి.శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. మృతుని వయసు సుమారు 60 నుంచి 65 సంవత్సరాల మధ్య వుంటుందని, ఎవరైనా గుర్తిస్తే విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గల గవర్నమెంట్ రైల్వే పోలీసులకు స్వయంగా, లేదా 9440627547/9866413487లో తెలియజేయాలని కోరారు.